సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 5 । జూలై । 2023



న్యూస్‌రీల్

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదల చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. పరీక్షకు 8130 మంది హాజరు కాగా, 3195 మంది(39.30 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీలో 5397 కి 1971 మంది, బీకాంలో 1416 కి 621, బీఏలో 975 కి 410, బీబీఏలో 132 మందికి 84, బీసీఏలో 210కి 109 మంది ఉత్తీర్ణత సాధించారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచారు. 15 రోజుల్లోగా విద్యార్థులకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

అలంకార రూపిణి



శాకంబరీ దేవిగా విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నానుబాల వీధిలోని విజయదుర్గమ్మను మంగళవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణీంద్రశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

చంద్రయాన్‌-3 ప్రత్యక్ష వీక్షణకు ప్రత్యేక బస్సు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా నుంచి తొలిసారిగా నెల్లూరులోని శ్రీహరికోటలో గల సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో 'చంద్రయాన్ -3' రాకెట్ లాంచింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు నెల్లూరులోని శ్రీహరికోటలో గల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రత్యేక అనుమతి తీసుకున్నారని చెప్పారు. తద్వారా చంద్రయాన్‌-3ని డిగ్రీ చదివే విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభిస్తోందన్నారు. సైన్స్ విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశమని తెలిపారు. ఈ అవకాశాన్ని డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఈనెల 12వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూపర్‌లగ్జరీ బస్సు మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరుతుందన్నారు. ఈ విహారయాత్రలో భాగంగా అక్కడ దర్శనీయ ప్రాంతాలైన రాకెట్ లాంచింగ్ ప్రదేశం, నేలపట్టు బర్డ్ శాంక్చురీ, పులికాట్ బర్డ్ శాంక్చురి, విజయవాడలో గల ప్రసిద్ధ కనకదుర్గమ్మ ఆలయం, నెల్లూరు బీచ్ తదితర ప్రదేశాలు కూడా చూడవచ్చని వివరించారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 8గంటలకు బయల్దేరి 15వ తేదీ మధ్యాహ్నం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణ చార్జీ ఒక్కొక్కరికి రూ.4,100 గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజయ్‌కుమార్ కోరారు. వివరాలకు 7095040608, 9959225608, 7382917289 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

పట్నంలో రాజకీయం.. రసకందాయం



- పాతపట్నం టీడీపీలో రగులుతున్న చిచ్చు
- టికెట్ కోసం కలమట, మామిడి మధ్య యుద్ధం
- మామిడికి హ్యాండిచ్చిన కింజరాపు ఫ్యామిలీ
- కలమట బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తలొగ్గిన వైనం
- లోకేష్‌కు చేరువైన మామిడి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పాతపట్నంలో టీడీపీ టికెట్ రేసు అనేక మలుపులు తిరుగుతోంది. కింజరాపు కుటుంబం ఒకరికి హ్యాండ్ ఇవ్వడంతో ఇక్కడ రాజకీయం రసకందాయంలో పడింది. పార్టీ కోసం పనిచేస్తున్న మామిడి గోవిందరావును లక్ష్యంగా చేసుకుని కింజరాపు ఫ్యామిలీ రాజకీయాలు చేస్తోంది. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను అచ్చెన్నాయుడుతో పాటు ఎంపీ రామ్మోహన్‌నాయుడు వెనకేసుకొస్తున్నారు. అచ్చెన్నాయుడు ఇంతకుముందు చెప్పినట్టు మామిడి గోవిందరావు చేత డబ్బులు ఖర్చు పెట్టించుకుని, కొన్నాళ్లు వాడుకుని ఆ తర్వాత వదిలేస్తామన్న వ్యాఖ్యలు నిజం చేస్తున్నారు. దీన్ని పసిగట్టిన మామిడి కూడా అప్రమత్తమయ్యారు. వీళ్లని కాదని ఏకంగా లోకేష్‌తో టచ్‌లోకి వెళ్లారు. తనకే సీటు వస్తుందని నియోజకవర్గంలో పార్టీ పరంగా బల నిరూపణ చేసుకుంటున్నారు. దానికి తన పుట్టిన రోజున వేదికగా చేసుకుని కలమట వెంకటరమణకు, ఆయనకు మద్దతుగా ఉన్న కింజరాపు ఫ్యామిలీకి పరోక్షంగా సవాల్ విసిరారు.

రెండు వర్గాలుగా విడిపోయి..

పాతపట్నంలో టీడీపీ గ్రూపు రాజకీయాలు రంజుగా సాగుతున్నాయి. కార్యకర్తలు ఎవరివైపు ఉండాలో తేల్చుకోలేక సతమతమవుతున్నారు. జిల్లాకు పెద్ద దిక్కు అనుకుంటున్న కింజరాపు ఫ్యామిలీ ఎత్తుగడలను అంచనా వేయలేక తీవ్రంగా నలిగిపోతున్నారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు రెండు వర్గాలుగా విడిపోయారు. మొదట్లో పార్టీ కేడర్‌లో కొంత బలంగా కలమట కనిపించినా మామిడి గోవిందరావు వ్యూహాత్మక రాజకీయాలతో ఆ పార్టీలోని కీలక నాయకులను తనవైపు తిప్పుకుంటున్నారు. చెప్పాలంటే టీడీపీ కేడర్‌ను నిట్టనిలువునా చీల్చేశారు. మొన్నటికి మొన్న ఎల్ఎన్‌పేట మండల పార్టీ నాయకులు వెలమల గోవిందరావు, కాగన మన్మథరావును తనవైపు తిప్పుకోగా, తాజాగా హిరమండలం పార్టీ నాయకులు యాళ్ల నాగేశ్వరరావును తనవైపు లాక్కున్నారు. ఇలా ఒక్కొక్కరిగా కలమట అనుచరులు, పార్టీ నాయకులను మామిడి గోవిందరావు తన వెంట తిప్పుకోవడంలో సక్సెస్ అయ్యారు. ఇలా జరుగుతుందని పసిగట్టే గతంలో కలమట వెంకటరమణ కింజరాపు ఫ్యామిలీ వద్ద పంచాయితీ పెట్టారు. మామిడిని ప్రోత్సహించవద్దని మొర పెట్టుకున్నారు. ఈ సమయంలో కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు డబుల్ గేమ్ ఆడారు. 'వాడుకుని వదిలేద్దామని...పార్టీ కోసం బాగా ఖర్చు పెట్టించి, తద్వారా నీకు మేలు జరిగేలా చూస్తామని' కలమట వెంకటరమణ వద్ద అచ్చెన్నాయుడు బాహాటంగానే వ్యాఖ్యానించారు. అప్పట్లో ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టి సంచలనం సృష్టించింది. ఇదే సమయంలో మామిడి గోవిందరావు వద్ద 'నీకెందుకు మేమున్నాం.. కలమటను పట్టించుకోవద్దు.. ఆయన అలాగే మాట్లాడుతాడు. మేము అసలు పట్టించుకోం.. నీ పని నువ్వు చేయ్' అంటూ ప్రోత్సహించారు. ఇలా ఇద్దరి మధ్య చిచ్చు పెడుతూ ఒకరికి తెలియకుండా మరొకరిని సమర్థించారు.

తర్వాత పార్టీలో పరిణామాలు మారిపోయాయి. కింజరాపు ఫ్యామిలీని కలమట వెంకటరమణ ఏ రకంగా బ్లాక్ మెయిల్ చేశారో గానీ మామిడి గోవిందరావుకు మద్దతు లేకుండా చేయగలిగారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు కూడా మామిడిని దూరం పెడుతున్నారు. తరుచూ కలుద్దామని ప్రయత్నిస్తున్న మామిడి అండ్ కోకు అకాశమివ్వడం లేదు. డైరెక్ట్‌గా కలమటకు మద్దతు ఇచ్చేలా వ్యవహరిస్తున్నారు. ఇదంతా గమనించిన మామిడి కూడా తన రాజకీయ వైఖరిని మార్చుకున్నారు. కింజరాపు నీడ నుంచి బయటపడి లోకేష్ వద్దకు చేరుకున్నారు. లోకేష్‌తో టచ్‌లోకి వెళ్లి కింజరాపు ఫ్యామిలీ వ్యూహాలకు దీటుగా రాజకీయాలు చేస్తున్నారు. అదే సందర్భంలో కింజరాపు ఫ్యామిలీ మద్దతిస్తున్న కలమట వెంకటరమణకు నియోజకవర్గంలో బలం లేదని నిరూపించేందుకు తరచూ ప్రయత్నిస్తున్నారు. చెప్పాలంటే కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుకు సవాల్ విసిరేలా బల నిరూపణ చేస్తున్నారు. ఇటీవల జరిగిన తన పుట్టిన రోజు వేడుకను కూడా బల నిరూపణ సభగా మార్చేశారు. ఆ వేదికపై కలమట వెంకటరమణే లక్ష్యంగా చెలరేగిపోయారు. గతంలో అవినీతి చేసిన కలమటకు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వకూడదని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా కింజరాపు ఫ్యామిలీ మద్దతిస్తున్న కలమట వెనక ఎవరూ లేరన్నట్టుగా మండలాల వారీగా నాయకులను తన వైపు తిప్పుకుని వేదికపైనే బల ప్రదర్శనగా చూపించారు. ఇదంతా చూసి మామిడిని కూడా అదును చూసే దెబ్బకొట్టే పనిలో కింజరాపు ఫ్యామిలీ ఉన్నట్టుగా నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది.

పొలిటికల్ టాక్

అయోమయ స్థితిలో క్యాడర్..

వరుస పరిణామాలతో టీడీపీ క్యాడర్ అయోమయ స్థితిలో పడింది. ఎవరి వెంట నడవాలో తెలీని దుస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలో ఉన్న కొద్దోగొప్పో నాయకులు ఒక్కొక్కరిగా మామిడి వెంట వెళ్తున్నారు. మొత్తానికి కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు ఆడిస్తున్న రాజకీయ డ్రామాలో ఎవరు బలైపోతారో గానీ ఒక నాయకుడికి మాత్రం గట్టి దెబ్బే తగులుతుందని పార్టీ శ్రేణులు అనుకుంటున్నాయి.

మీ సెల్ మరింత సురక్షితం





దిశా సైబర్ కవచ్ మానిటర్ వద్ద ఎస్పీ రాధికతో పాటు అధికారులు, విద్యార్థులు

ఇక్కడ ఎస్పీ జీఆర్ రాధిక ప్రారంభిస్తున్న మెషీన్ పేరు దిశా సైబర్ కవచ్ మానిటర్. ఈ మిషన్‌కు మీ ఫోన్‌ను కేబుల్‌తో అనుసంధానం చేస్తే.. మీ మొబైల్‌లో రహస్యంగా ఉండిపోయిన ప్రమాదకర యాప్‌లు, మాల్‌వేర్‌లు, సాఫ్ట్‌వేర్‌లను ఇది ఇట్టే గుర్తు పట్టేస్తుంది. అక్కడికక్కడే ఈ ప్రమాదకర యాప్‌లు, సాఫ్ట్‌వేర్‌లను తొలగించుకోవచ్చు. ఈ ప్రక్రియకు సహాయం చేయడానికి ఇక్కడ ఓ పోలీస్ సిబ్బంది కూడా ఉంటారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన యాప్‌ను పౌరులు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారం భద్రంగా ఉంటుందని పోలీసులు భరోసా ఇస్తున్నారు.



- పెరుగుతున్న సైబర్ మోసాలను అరికట్టేందుకు కొత్త సాఫ్ట్‌వేర్ మెషీన్
- లాంఛనంగా ప్రారంభించిన ఎస్పీ జీఆర్ రాధిక
- పౌరులు ఉపయోగించుకోవాలని పిలుపు

సైబర్ అలర్ట్

శ్రీకాకుళం క్రైమ్ : పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకువేసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం దిశ సైబర్ కవచ్ మానిటర్‌ను ఎస్పీ రాధిక రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని పౌరులంతా దిశా సైబర్ కవచ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సైబర్ మానిటర్‌కు కనెక్ట్ చేసి స్కాన్ చేస్తే అందులో ఉన్న వైరస్, సైబర్ మాల్‌వేర్‌తో పాటు మనకు తెలియకుండా ఇన్‌స్టాల్ అయిన యాప్‌లను తొలగించుకోవచ్చని, దీని వల్ల సైబర్ దాడుల నుంచి తప్పించుకోవచ్చని ఆమె తెలిపారు. చూసేందుకు ఏటీఎం మిషన్‌లా కనిపిస్తుందని, విద్యార్థులు దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వర్రావు (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్), డీఎస్పీలు యర్రగుంట శృతి, ఎస్.బాలరాజు, పరిపాలనాధికారి సిహెచ్.గోపినాథ్, సీఐలు బూర ప్రసాదరావు, శ్రీనివాసరావు, లెంక సన్యాసినాయుడు, పప్పల శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఆర్ఐలు ఉమామహేష్, బి.ప్రదీప్, సైబర్ సెల్ ఎస్ఐ ప్రసాదరావు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'సురక్ష పర్వం'

జిల్లా వ్యాప్తంగా పత్రాల పంపిణీ పర్వం సజావుగా జరుగుతోంది. 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా అవసరార్థులకు కావాల్సిన పత్రాలు పంపిణీ చేస్తుండగా, సంక్షేమ పథకాలపై కూడా ఫిర్యాదులు తీసుకుని అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఈ వినూత్న కార్యక్రమంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఆమదాలవలస, శ్రీకాకుళం (పీ.ఎన్.కాలనీ), పాతపట్నం



జగన్‌కు అండగా జనం

వైఎస్ జగన్‌కు జనం అండగా ఉన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆయనను ఓడించలేరు. ఓటమి భయంతోనే చంద్రబాబు, లోకేష్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు. - తమ్మినేని సీతారాం, స్పీకర్

(ఆమదాలవలస మండలం లక్ష్ముడిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో..)



సంక్షేమం.. సర్వజన క్షేమం

'జగనన్న సురక్ష' కార్యక్రమం నిస్సహాయులకు అండ. దీని వల్ల క్షేత్రస్థాయి సమస్యలు తెలుస్తాయి. ఇన్ని పథకాలు అమలు చేస్తున్నాం. ఎక్కడా పైసా అవినీతి లేదు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమం అమలు చేస్తున్నాం. - ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి,

(శ్రీకాకుళం హడ్కోనగర్ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో..)



సమస్యల పరిష్కారానికే..

అర్హుల సమస్యలను పరిష్కరించడానికే 'జగనన్న సురక్ష' అమలుచేస్తున్నాం. ఏ కారణం చేత అయినా పథకం అందకపోతే ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలి.

- రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

(పెదలోగిడిలో నిర్వహించిన కార్యక్రమంలో..)

బడులు యథావిధిగా పనిచేయాలి: డీఈఓ

శ్రీకాకుళం న్యూకాలనీ: స్టేట్ ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నేడు యథావిధిగా పనిచేయాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ ఆదేశాలను అతిక్రమించిన పాఠశాలల యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పరిశీలించాలని, ఎవరైనా సెలవు ఇస్తే నివేదికలు సమర్పించాలని డీఈఓ ఆదేశించారు.

కేంద్రీయ విద్యాలయం బాల్ వాటిక-3లో ప్రవేశాలు

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని పెదపాడు పరిధిలో గల కేంద్రీయ విద్యాలయంలో బాల్ వాటిక-3లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె శంకరయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 6 నుంచి 18 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 2023 మార్చి 31కి ఐదేళ్లు నిండి ఆరు సంవత్సరాల్లోపు బాలబాలికలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు (http//srikakulam.kvs.ac.in) నందు చూడవచ్చునన్నారు. కేంద్రీయ విద్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

గురూపదేశం

ఇచ్ఛాపురం: జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ కాసేపు టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్ బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసేపు మానవతా విలువలపై విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఉలాల భారతీ దివ్య, హెచ్ఎం వై.లత పాల్గొన్నారు.



సౌకర్యాలు పెరిగినా.. కుళ్లు రాతలేనా?



అరసవల్లిలో ఇటీవల ఆలయం వెలుపల నిర్మించిన జింక్ షెడ్

- అరసవల్లిలో గతం కంటే పెరిగిన నదుపాయాలు
- నిర్మాణం పూర్తి చేసుకున్న ఆధునిక మరుగుదొడ్లు
- వాస్తవాలు వక్రీకరించేలా 'ఈనాడు' కథనం

అరసవల్లి: అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వసతులు పెరిగాయి. ముఖ్యంగా రెండేళ్ల నుంచి ఆలయంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయం బయట జింకు షెడ్లు, మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణాలు, ఇతర వసతులు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక మరుగుదొడ్లు నిర్మాణం కూడా దాదాపు పూర్తి చేసుకుంది. ఇన్ని జరుగుతుంటే ఈనాడు మాత్రం 'వసతి సౌకర్యం అస్తవ్యస్తం' పేరిట భక్తులను గందరగోళానికి గురి చేయడానికి ప్రయత్నిస్తోంది.

ఈనాడు ఏం రాసింది..?

- వసతి గదుల్లో పరుపులు పాడై వాటి నుంచి దుర్వాసన వస్తోంది.
- దాతలు సమకూర్చిన మంచాలు, పరుపులు, దుప్పట్లు ఏళ్ల తరబడి వాటినే ఉపయోగిస్తున్నారు.
- మరుగుదొడ్లు, స్నానపు గదుల తలుపులు విరిగిపోయాయి.
- పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండి అపరిశుభ్రతకు ఆలవాలంగా మారాయి.
- వసతి గదుల విషయంలో తప్పుడు లెక్కలతో ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు.

వాస్తవం ఏమిటి..?

ఫ్యాక్ట్ చెక్

- కోవిడ్ తర్వాత పరుపుల్ని మార్చారు. నిరంతరం శుభ్రతా చర్యలు కొనసాగుతున్నాయి. బెడ్‌షీట్లు, పిల్లోస్ ఉతికేందుకు ప్రత్యేకంగా దోబీని నియమించారు.
- మంచాలు, పరుపులు దాతలు ఇచ్చినవి కాదు. దేవస్థానానికి సంబంధించినవే. ఇటీవలే వాటిని మరమ్మతులు చేసి కొత్తపరుపులను అందుబాటులోకి తెచ్చారు.
- టూరిజం డార్మిటరీ దగ్గర పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, స్నానపు గదులను అందుబాటులో ఉంచారు.
- ఆరుగురు సిబ్బంది నిరంతరం ఆలయ పరిసరాలను శుభ్రం చేసే పనిలో ఉంటున్నారు.
- వసతి గదులను కచ్చితంగా ఆధార్ కార్డు జిరాక్సుతో వచ్చిన వారికి మాత్రమే నిర్దేశిత రుసుముతో ఇస్తున్నారు.

సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం..



అరసవల్లి ఆలయంలో నాలుగేళ్ల కిందట పెద్దగా సదుపాయాలు లేవు. ప్రస్తుత ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, ట్రస్ట్ బోర్డు సభ్యుల సూచనలతో పాటు అధికంగా భక్తదాతల విరాళాలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. సుమారు విరాళాలతో ఐదు జింకు షెడ్లు నిర్మించాం. ఆధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు నిర్మించాం. వసతి గదుల విషయంలో కూడా ఎక్కడా అసౌకర్యాలు లేవు. - వి.హరిసూర్యప్రకాష్, ఈఓ.



క్లుప్తంగా

స్మార్ట్‌కెం సమీపంలో మంటలు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలోని స్మార్ట్ కెం పరిశ్రమ సమీపంలో మంగళవారం మంటలు ఎగిసి పడ్డాయి. పొదలకు మంటలు విస్తరించటంతో పరిశ్రమ ఉద్యోగి రాజేష్ శ్రీకాకుళం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వాహనంతో సకాలంలో చేరుకొని పొదలకు అంటుకున్న మంటలు అదుపు చేశారు. అయితే మంటలు సంభవించడానికి కారణం తెలియరాలేదు.

తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించాలి



లావేరులో రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తెలగ సంఘం జిల్లా, మండల నాయకులు.

లావేరు: తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించాలని, తెలగ కులస్తులకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రొక్కం సూర్యప్రకాష్, ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకుడు పల్లంట్ల వెంకటరామారావు అన్నారు. మండలంలోని లావేరు గ్రామంలో మంగళవారం ఉత్తరాంధ్ర తెలగ సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా లావేరులో వంగవీటి మోహనరంగా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 8 లక్షల మంది తెలగ కులస్తులు ఉన్నారని, అయినా చట్టసభల్లో అవకాశం లేదన్నారు. తమ వర్గం వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. తెలగ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య



భర్త మృతదేహానికి తలకొరివి పెడుతున్న భార్య రోహిణి

హిరమండలం: భర్తకు భార్య తలకొరివి పెట్టిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మేజర్ పంచాయతీ హిరమండలం చిన్నకోరాడకు చెందిన నగరపు శంకరరావు (40) కడుపు నొప్పి తాళలేక ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించగా అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ముందుకు రాలేదు. కుమారులు కూడా లేరు. ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ వీలు చిక్కలేదు. దీంతో భార్య రోహిణి భర్త మృతదేహానికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసి రుణం తీర్చుకుంది.

మెడికో అంత్యక్రియలు పూర్తి



చైతన్య అంత్యక్రియలకు హాజరైన జనం

కాశీబుగ్గ: నెల్లూరులో ఆత్మహత్య చేసుకున్న వైద్య విద్యార్థిని చైతన్య అంత్యక్రియలు మంగళవారం ఉదయం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 06వ వార్డు పెసరపాడులో జరిగాయి. ఆమె మృతదేహాన్ని చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు అధికంగా వచ్చారు. గ్రామ సమీపంలో ఉన్న శ్మశానంలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు చేశారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఐఏఎల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కూన అన్నం నాయుడు కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కోర్టు ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు, సంక్షేమ నిధి మొత్తాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ప్రతినిధులు జి.చంద్రమౌళి, గంగు భాస్కరరావు, హరిప్రియ, బీసీ న్యాయవాదులు సంఘం ప్రతినిధులు ఆగూరి ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, ఎ.కృష్ణంరాజు, బి.వి.రమణ, కూన వసవయ్య, మామిడి క్రాంతి, పైడి జోగారావు ఉన్నారు.

సైన్స్ ప్రదర్శనలకు వేళాయె..

- 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నామినేషన్ల స్వీకరణ

ఇన్‌స్పైర్ మనాక్ లోగో



శ్రీకాకుళం హయాతీనగరంలోని జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ ఆశ్రమ పాఠశాలలో ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు వేళయింది. 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఇన్‌స్పైర్ మనాక్ పేరిట ప్రాజెక్టుల నమూనాలు ప్రదర్శించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నామినేషన్ల ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్‌స్కూళ్లు, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు తమ నామినేషన్లు చేసుకునేందుకు అర్హులు. సైన్స్ ప్రాజెక్టుల నమూనా ప్రదర్శనలకు ఈ పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఉంటుంది.

ఆన్‌లైన్‌లో నామినేషన్ల ప్రక్రియ..

ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలలు ఐదు, ప్రాథమికోన్నత పాఠశాలలు రెండు లేదా మూడు చొప్పున ప్రాజెక్టులకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ప్రాజెక్టు నామినేషన్ల ప్రక్రియను పూర్తిచేయాలి. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలు 410 ఉండగా వీటిల్లో 1,08,242 మంది చదువుతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 304 ఉండగా వీటిల్లో 28210 మంది చదువుతున్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టుల వివరాలు నమోదు చేసుకోవడానికి అర్హులు.

ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి: డీఈవో

సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు నామినేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసేలా ఆయా యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య కోరారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్.డీఎస్‌జీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో ప్రాజెక్టుల వివరాలను తెలుసుకోవడంతోపాటు నామినేషన్ల పూర్తిచేయాలన్నారు. అలాగే బ్యాంకు అకౌంట్ నంబర్లను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎన్.కుమారస్వామి (సెల్: 9490037182, 8074332929)ని సంప్రదించాలన్నారు.

సిక్కోలు వేదికగా రాష్ట్ర చెస్ పోటీలు



రాష్ట్రచెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, మీట్ నిర్వహణ కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా మరోసారి రాష్ట్రస్థాయి చెస్ పోటీలు జరగనున్నాయి. శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా ఈ నెల 15, 16 తేదీల్లో ఓపెన్ స్టేట్‌మీట్ చెస్ పోటీలు నిర్వహించనున్నారు. జననాయక్ డాక్టర్ చౌదరి సత్యనారాయణ మెమోరియల్ పేరిట పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు రూ.52 వేల నగదు బహుమతులతో పాటు మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లను పోటీలు జరిగే ప్రాంగణంలోనే కల్పిస్తున్నారు. మరికొంతమంది చీఫ్ ఆర్బిటర్లు, ఆర్బిటర్లకు స్థానికంగా హోటళ్లలో వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ టోర్నమెంట్ కు చీఫ్ ఆర్బిటర్‌గా విజయవాడకు చెందిన ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఫణి కుమార్ వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులు ఏపీచెస్.వోఆర్జీ వెబ్‌సైట్‌లో లేదా సెల్ నంబర్ 9912559735ను ఈ నెల 10వ తేదీలోగా సంప్రదించాలని ఏపీచెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల భీమారావు, టోర్నమెంట్ డైరెక్టర్ చౌదరి సతీష్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం ఆవిష్కరించారు. పోటీలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ యువ నాయకులు, టోర్నమెంట్ డైరెక్టర్ చౌదరి సతీష్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘనమైన నివాళి



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఘనంగా నివాళులు అర్పించారు. అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాల వేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 27 ఏళ్లకే దేశం కోసం పనిచేసిన గొప్ప వీరుడు అల్లూరి అని, తనకు ఉన్న పరిమిత వనరులతో బ్రిటిష్ వాళ్లను గడగడలాడించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.శ్రీకాంత్ వివిధ కార్యాలయాల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం ఆదర్శప్రాయం

శ్రీకాకుళం క్రైమ్ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్), డీఎస్పీలు యర్రగుంట శృతి, ఎస్.బాలరాజులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుర్తు తెలియని జంతువు అలజడి



అంబుగాం తోటల్లో దూడను చంపి, తినేసిన గుర్తు తెలియని జంతువు

మందస: గుర్తు తెలియని జంతువు అలజడి సృష్టిస్తోంది. రెండు రోజులుగా అంబుగాం సమీపంలోని జంతువులపై దాడి చేస్తోంది. అంబుగాం గ్రామానికి చెందిన సిందిరి పురుషోత్తం లేగదూడను ఆదివారం రాత్రి దాడి చేసి చంపేసిన జంతువు సోమవారం రాత్రి సిందిరి దాలిబందు దూడ(పెయ్య)పై దాడి చేసి చంపి గుండె ప్రాంతంలోని భాగాలను తినేసింది. దీంతో పశువుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలో చోటుచేసుకోగా అధికారులు కెమెరాలు పెట్టి మరీ వెతికారు. అయినా ఫలితం లేకపోయింది. అధికారులు స్పందించి జంతువు నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్సిటీలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు పరిశీలిస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 4వ సెమిస్టర్, ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి 6, 8వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతున్నాయి. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు పరీక్షల నిర్వహణ తీరు పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యం లేకుండా, మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

పదోన్నతుల కౌన్సెలింగ్ నేడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల పోస్టుల పదోన్నతుల కోసం నేడు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు వారివారి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, సర్వీస్ రిజిస్టర్ విధిగా తీసుకురావాలని ఆయన సూచించారు.

బాలుడికి భారీ ఆర్థిక సాయం



తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడికు నగదు అందజేస్తున్న దాతలు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామం జగపూర్‌కు చెందిన దున్న లోహిత్ అనే బాలుడు కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నాడు. బాలుడి తండ్రి ధర్మారావు ఇటీవల టర్కీకు ఉపాధి కోసం వెళ్లారు. అక్కడ తన తోటి కూలీలకు గోడు చెప్పుకున్నారు. దీంతో వారంతా కలిసి మంగళవారం బాలుడి వైద్యం కోసం ఏకంగా రూ.14,32,500 నగదును అందజేశారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

వేధింపులు తాళలేక ట్రాక్‌మెన్ ఆత్మహత్య

- తాడేపల్లిలో ఘటన, మృతుడు పోలాకి వాసి



హేమసుందర్ (ఫైల్)

పోలాకి: రైల్వే అధికారుల వేధింపులకు ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలాకి మండల కేంద్రానికి చెందిన టంకాల హేమసుందరరావు (32) ఇండియన్ రైల్వేలో 2013 నుంచి ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తాడేపల్లిలో తాను నివాసం ఉంటున్న క్వార్టర్స్‌లో ఆదివారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తోటి సిబ్బంది గుర్తించారు. విషయం తెలుసుకున్న హేమసుందర్ కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల వేధింపులకు తమ కుమారుడు చనిపోయాడని మృతుడి తండ్రి రాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. హేమసుందర్‌కు భార్య లక్ష్మి, తొమ్మిది నెలల కుమారుడు సిద్దార్థరామ్ ఉన్నారు. హేమసుందర్ మృతదేహాన్ని బుధవారం స్వగ్రామం తీసుకురానున్నారు.

అప్పులు తీర్చలేమనే భయంతో మహిళ బలవన్మరణం



అన్నపూర్ణమ్మ మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: చేసిన అప్పులు తీర్చలేమనే భయంతో వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడినట్టు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. బలగ మెట్టు శివాలయం గుడి దగ్గర బుంగ అన్నపూర్ణమ్మ (50) కొబ్బరికాయలు, అరటి పండ్లు, పువ్వులు విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈమెకు భర్త నాగేశ్వరరావు, నలుగురు కుమాలు ఉన్నారు. వీరిలో ముగ్గురు కుమారులకు వివాహమైంది. అందరూ ఉమ్మడిగా కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. తమకు తెలిసిన వారి వద్ద రూ. 3 లక్షలు అప్పుగా తెచ్చి కుమారుల చేత రెండేళ్ల క్రితం ఇటుకల బట్టీని బలగ నాగేశ్వరి ఘాట్ (నాగావళి నది) వద్ద అన్నపూర్ణమ్మ పెట్టించింది. కొన్నాళ్లు బాగా నడిచినా ఆ తర్వాత సరిగా లాభాలు రాక ఆపేశారు. దీంతో పెద్ద కుమారుడు హెరిటేజ్‌లో బాయ్‌గా, మరో ఇద్దరు కుమారులు ఎయిర్‌టెల్, ఫైబర్‌లో పనిచేస్తున్నారు. వీరంతా పనిచేసి తెచ్చిన సొమ్ము ఇంటి ఖర్చులకే సరిపోతున్నాయి. దీనికితోడు భర్త నాగేశ్వరరావు మద్యం తాగి గొడవ చేస్తుండేవాడు. దీంతో మనస్తాపం చెందిన అన్నపూర్ణ ఈ నెల మూడో తేదీ ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లో ఉన్న వాస్‌మాల్ –33 ఆయిల్ తాగి అపస్మారక స్థితిలో ఇంటి దిగువున స్టోర్‌రూమ్‌లో పడిపోయింది. పెద్ద కోడలు నాగేశ్వరి చూసి కుటుంబ సభ్యులకు చెప్పడంతో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి అన్నపూర్ణమ్మ మరణించినట్లు సీఐ చెప్పారు. పెద్ద కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యువకుడు మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: టెక్కలి కంద్రవీధికి చెందిన యువకుడు నాగుల ధర్మ (31) చేపలు విక్రయించడానికి వెళ్లి వస్తూ చనిపోయినట్టు పోలీసులు తెలిపారు. ముఖలింగాపురం పంచాయతీ పరిధి చిరుతునాపల్లి గ్రామంలోని పంట పొలాల్లో మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించినట్టు చెప్పారు. ఇద్దరు స్నేహితులతో కలిసి ధర్మ కొల్లివలస గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టి విక్రయించేందుకు సమీప గ్రామాల్లోకి సోమవారం వెళ్లారు. ఇందులో భాగంగానే చిరుతునాపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీప పొలాల్లో ధర్మ అస్వస్థతకు గురై పడిపోయాడు. అతని వెంట ఉన్న స్నేహితులు మద్యం మత్తులో పడిపోయి ఉంటాడని.. మెలకువ వచ్చిన తరువాత ఇంటికి వస్తాడని భావించి వదిలేసి వచ్చేశారు. అయితే మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు శవమై ఉన్న ధర్మను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. ధర్మ వెంట వెళ్లిన వారిని విచారించి వివరాలు సేకరించారు. మృతుని అన్నయ్య సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రైలు కింద పడి యువకుడు మృతి



బ్రహ్మాజీ మృతదేహం

పొందూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి పొందూరుకు చెందిన కాకినాడ బ్రహ్మాజీ (20) మృతి చెందాడు. కొద్ది రోజుగా మానసిక ఒత్తిడిలో ఉన్న బ్రహ్మాజీ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఏడుఖానాలు సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

కారు,బైక్ ఢీ

- వ్యక్తి దుర్మరణం



కిశోర్ చంద్ర బెహరా మృతదేహం

మెళియాపుట్టి: కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గొప్పిలి పరిసర ప్రాంతంలో జరిగింది. మెళియాపుట్టి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని బేటాసింగ్ గ్రామానికి చెందిన కిశోర్ చంద్ర బెహరా మంగళవారం ద్విచక్ర వాహనంపై గొప్పిలి గ్రామానికి వచ్చి పనులు చూసుకొని తిరిగి వెళ్తుండగా.. కాంట్రగడ గ్రామ సమీపంలో పలాస వైపు నుంచి వస్తున్న ఒడిశాకు చెందిన కారు బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహనదారుడు కిశోర్ చంద్ర బెహరా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని జేబులో ఉన్న ఓటర్ ఐడీ కార్డు ఆధారంగా అతని వివరాలు తెలుసుకున్నారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన పరమేష్

లావేరు: లగేజీ ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన లావేటిపాలెం గ్రామం సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. రణస్థలం మండలం నగరపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు లగేజీ ఆటోతో టెంట్లు, షామియానాలు తీసుకొని లావేరు గ్రామానికి వచ్చారు. తిరిగి నగరపాలెం గ్రామానికి వెళ్లే క్రమంలో లావేటిపాలెం సమీపంలో అదుపు తప్పి ఆటో రోడ్డుపై బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న పరమేష్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహన సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

రణస్థలంలో దొంగలు పడ్డారు

- 130 తులాల వెండి, 3.5 తులాల బంగారం అపహరణ
- సెల్‌ఫోన్లు, టీవీ, ఇన్వర్టర్లను సైతం తీసుకెళ్లిన చోరులు



చోరీ జరిగిన సెల్ దుకాణం

రణస్థలం: రణస్థలం మండలంలో పలు చోట్ల దొంగతనాలు జరిగాయి. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న కొప్పిశెట్టి లక్ష్మణ ఇంట్లో వంద తులాల వెండిని సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. ఇంట్లో వేర్వేరు గదుల్లో అందరూ పడుకోగా..లోనికి చొరబడిన దొంగలు దేవుడు గదిలో ఉన్న వెండిని అపహరించుకుని పోయినట్లు మంగళవారం ఉదయం లక్ష్మణ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీం వివరాలు సేకరించారు. అలాగే సోమవారం రాత్రి కోష్ట గ్రామంలోని పద్మ సెల్ దుకాణంలో కూడా చోరీ జరిగింది. దుకాణం యజమాని సూరాడ అప్పన్న తెలిపిన వివరాల ప్రకారం.. సెల్ దుకాణంపై సిమెంట్ రేకులు పగులకొట్టి 15 సెల్‌ఫోన్లు, ఎల్‌సీడీ టీవీ, ఇన్వర్టర్‌ను దొంగలు పట్టుకెళ్లిపోయారు. ఈ రెండు దొంగతనాలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. అలాగే గత నెల 28వ తేదీన మండల కేంద్రంలోని కాపు వీధిలో ఉంటున్న కరిమజ్జి రామప్పడు ఇంట్లో 3.5 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 16 వేలు నగదు, రూ. రెండు లక్షల విలువైన బాండ్లు పోయినట్లు జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	59,060–00
బంగారం(22కి. 10గ్రా.)	54,150–00
వెండి (కిలో)	75,800–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240